ప్రజాశక్తి

శనివారం 5 అక్టోబర్ 2024

5

పార్వతీపురం మన్యం

నేడు పిఎం కిసాన్ నిధులు విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

18వ విడత పిఎం కిసాన్ నిధులు శనివారం విడుదల చేయనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. జిల్లాలో 1,14,228 మంది లబ్ధిదారులకు రూ.22.85 కోట్లు విడుదల కానున్నట్లు చెప్పారు. మహారాష్ట్రలోని వాసింలో జరుగు కార్యక్రమంలో ప్రధానమంత్రి పిఎం కిసాన్ నిధులను విడుదల చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.

ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలి

- సిపిఎం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ఆందోళన
- ట్రాక్టర్లతో ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేసేలా కషి చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ నుంచి ప్రధాన రహదారి గుండా భవన నిర్మాణ కార్మికులు, ట్రాక్టర్ యజమానులు ట్రాక్టర్లతో ర్యాలీ చేసుకుంటూ కలెక్టరేట్‌కు చేరుకొని అక్కడ నిరసన తెలిపారు. అనంతరం డిఆర్ఒకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిఐటియు జిల్లాప్రధానకార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు కొల్లి సాంబమూర్తి తదితరులు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించకపోవడంతో రేట్లు పెరిగిపోవడం, విచ్చలవిడి అవినీతి వల్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడిందని అన్నారు. అనేక కారణాలతో పాటు ఇసుక సమస్యపై ఆగ్రహంతోనే వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించారని, ఉచితంగా ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి టిడిపి అధికారంలోకి వచ్చిందని, తీరా వచ్చిన వంద రోజుల పాలనలో ఇసుక విషయంలో

డిఆర్ఒకు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

పట్టణంలోని ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ, ట్రాక్టర్ కార్మికులు

గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా లేకుండా పోయిందని విమర్శించారు. ఈ జిల్లాకు 200 కిలోమీటర్ల దూరాన గల భామిని వద్ద కాట్రగడ్డ నుంచి ఇసుక తేవాలని, దీనివల్ల రవాణా ఖర్చు తడిచిమోపుడవుతుందన్నారు. కావున జిల్లాలో ఉన్న పాత ఇసుక రీచ్‌లను ప్రారంభించి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే ఉచిత హామీ అమలు చేయకపోవడం వల్ల ఇసుక లభించడం లేదని, రవాణా చార్జీలు, ఇతర పేర్లు చెప్పి ఇసుక రేటు తగ్గించలేదని, ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతలు పలుచోట్ల ఇసుకపై పెత్తనం చెలాయిస్తున్నారని, ముఖ్యమంత్రి పదేపదే బహిరంగంగా హెచ్చరిస్తున్న పరిస్థితిలో మార్పు రాలేదని అన్నారు. ఇసుక కొరత అధిక రేట్ల వల్ల భవనిర్మాణ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటుందని, భవన నిర్మాణ కార్మికులు ట్రాక్టర్ యజమానులు, కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, ఇళ్ల నిర్మాణం చేసుకున్న చిన్న, పేద, మధ్యతరగతి వర్గాలు పై భారం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వము అందరికీ ఉచితంగా ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని, అందుబాటులో ఉన్న అన్ని ఇసుక రీచ్‌లను తెరవాలని అవినీతి అరికట్టాలని, భవన నిర్మాణ, ట్రాక్టర్ కార్మికులకు ఉపాధి చూపాలని, భవన నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలని, అధిక భారం లేకుండా చూడాలని, కోరారు.

డయేరియాతో ఇద్దరు మృతి

- కలుషిత తాగునీటి సరఫరాయే కారణం
- విశ్వనాథపురంలో మరో 25మందికి అస్వస్థత
- కొనసాగుతున్న వైద్య శిబిరం ● పరిశీలించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి -పాచిపెంట

మండలంలోని విశ్వనాథపురంలో డయేరియా విజృంభించింది. గురువారం రాత్రి ఇద్దరు వృద్ధులు డయేరియాతో మృతి చెందారు. మరో 25మంది అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతోంది. ఈ శిబిరంలో కొంతమంది వైద్యం పొందుతున్నారు. మరికొంతమంది విజయనగరం, సాలూరు పట్టణాల్లో ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్నారు. గ్రామానికి లెంక బంగారమ్మ(86), పడాల సీతన్న డయేరియాతో మృతి చెందారు. సీతన్న కొద్ది రోజుల క్రితం ఒడిశా నుంచి విశ్వనాథపురంలో బంధువుల ఇంటికి వచ్చి మృత్యువు పాలయ్యారు. గ్రామంలో కొంతకాలంగా తాగునీటి సరఫరా చేసే రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌ను శుభ్రం చేయకపోవడం, బ్లీచింగ్ కలపకపోవడం వంటి కారణాలతో తాగునీరు కలుషితమైనట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో అనూహ్యంగా డయేరియా విజృంభించిందనే వాదనలు వినిపిస్తున్నాయి. శుక్రవారం గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని డాక్టర్ డిఎంహెచ్ఒ విజయపార్వతి సందర్శించారు. స్థానిక వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వైద్య శిబిరంలో రోగులకు చికిత్స అందజేస్తున్న సిబ్బంది

ఎకో పార్క్ ఏర్పాటుకు సన్నాహాలు : పిఒ

సీతంపేట : స్థానిక ఐటిడిఎ పరిధిలోనినర్సరీలో ఎకో టూరిజం కింద కాటేజీలు నిర్మించేందుకు గల అవకాశాలపై శుక్రవారం నర్సరీని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ మొత్తాన్ని పరిశీలించి కాటేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకొంటామని అన్నారు. దీంతో ఎకో పార్క్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, పిహెచ్ వో గణేష్‌పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

గిరిజన ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

వన్ దన్ వికాస్ కేంద్రాల (విడివికె) ద్వారా గిరిజనులు ఉత్పత్తి చేసిన వస్తువులకు బ్రాండింగ్ కల్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ దిశగా గిరిజన ఉత్పత్తులకు మంచి ప్యాకింగ్ చేసి వాటికి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వన్ దన్ వికాస్ కేంద్రాల పనితీరుపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వన్ దన్ వికాస్ కేంద్రాలన్నీ (వి.డి.వి.కె) బాగా పనిచేయాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో ఒక మోడల్ వన్ దన్ వికాస్ కేంద్రం ఉండేలా విడివికెలను తీర్చిదిద్దాలని కలెక్టర్ తెలిపారు. ఇందుకు అవసరమైన మెషినరీ, శిక్షణ తదితర అవసరాలను తమ దృష్టికి తీసుకువస్తే, వాటిని మంజూరు చేస్తామని వివరించారు. గిరిజనులు పండించిన పంటలకు అదనపు ఆదాయం సమకూరాలని, విడివికె ఉత్పత్తులకు మంచి ప్యాకింగ్ చేసి, వాటికి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యం నాయుడు, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల ఎపిఒలు మురళి, చినబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ రేంజ్ అధికారిగా రామ్ నరేష్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక ఫారెస్ట్ రేంజ్ అధికారిగా బి.రామ్ నరేష్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఫారెస్ట్ అధికారి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. గతంలో విశాఖపట్నం రేంజ్ అధికారిగా పనిచేసిన ఈయన బదిలీపై పార్వతీపురం వచ్చారు. జిల్లాలో ముఖ్యంగా పార్వతీపురం కురుపాం నియోజకవర్గం సృష్టిస్తున్న ఏనుగుల గుంపును సమర్ధంగా ఎదుర్కొనేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. విశాఖపట్నం కంబాలకొండలో వన్యమృగ సంరక్షణ కేంద్రంలో సంపాదించిన అనుభవంతో ఇక్కడ గజరాజులు ఎక్కువగా ఆస్తి, ప్రాణ నష్టం కలగకుండా చూస్తానని, అలాగే ఏనుగువల్ల నష్టపోయినా రైతులకు పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఏనుగుల సంచారంతో పంట నష్టం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని ఆంధ్రా - ఒడిశా సరిహద్దు గ్రామాలకు చేరుకున్న ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి రైతులకు తీవ్రమైన పంట నష్టాన్ని కలగజేస్తున్నాయి. గురువారం రావికోన పంచాయితీ రంగాలగూడ తోటల్లో తలదాచుకున్న ఏనుగుల మంద శుక్రవారం ఉదయం నాటికి సంఘంవలస పంచాయతీ సీతంపేట మీదుగా తానవలస సమీపాన తిష్ట చేశాయి. ఈ ఏనుగుల కదలిక వల్ల చిన్నమరికి, పెదమరికి, చందలింగి, కొత్తవలస, రంగాల గూడ, సీతంపేట గ్రామాలకు చెందిన గిరిజనులు సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న పంటలను సర్వనాశనం చేశాయి. ప్రస్తుతానికి అటవీ శాఖకు చెందిన ట్రాకర్లు ఏనుగుల గుంపు గ్రామాల్లోకి రాకుండా చర్యలు చేపడుతున్నారు. పంట నష్టపోయిన రైతులు అటవీ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందిస్తే నష్టాన్ని అంచనా వేసి పరిహారం కోసం నివేదికలు పై అధికారులకు పంపుతామని అటవీ శాఖ సిబ్బంది తెలియచేస్తున్నారు.

ఏనుగుల ధ్వంసం చేసిన వరిపంట

హమ్మయ్య... రైలు బండి వచ్చిందోచ్!

ట్రయిల్ రన్ చేసిన రైల్వే అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న రైలు బండి కూత సాలూరులో వినిపించింది. ఎప్పుడొస్తుందా అని వేయికళ్లతో నిరీక్షించిన పట్టణవాసుల కోరిక అతిత్వరలో నెరవేరనుంది. శుక్రవారం ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు రైలు బండి రాకకోసం ట్రయిల్ రన్ పూర్తి చేశారు. కరోనాకు ముందే రైలు ట్రాక్ దండిగాం రోడ్ వరకు నిర్మించారు. పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త జిల్లెల్ల సీతారాం, మాజీ ఎమ్మెల్యే రాజన్నదొర గతంలో అనేక సార్లు రైల్వే ఉన్నతాధికారులకు రైలు బండి కోసం వినతులు అందజేశారు. అరుకు ఎంపీ డాక్టర్ తనూజా రాణి కూడా రైల్వే అధికారులతో మాట్లాడి సాలూరుకు రైలు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ట్రయిల్ రన్ పూర్తి చేయడంతో పట్టణ వాసుల ఆనందానికి అవధులు లేవు. శుక్రవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో విశాఖపట్నం నుంచి బొబ్బిలి మీదుగా రైలు బండి చేరింది. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్, ఇతర టిడిపి నాయకులు రైలు బండికి స్వాగతం పలికారు. కరోనా ముందు వరకు చాలా ఏళ్లుగాసాలూరు, బొబ్బిలి మధ్య రైలు బస్సు నడిచేది. బ్రిటిష్ వారు పాలించిన కాలంలో వారి సరుకుల రవాణా కోసం రైలు మార్గం ఏర్పాటు చేసి రైలు బస్సు నడిపారు. క్రమేణా దాని నిర్వహణ కు అయ్యే ఖర్చు కూడా ఆదాయం రూపంలో రాకపోవడంతో రైల్వే అధికారులు రైలు బస్సును నిలిపివేశారు. అనేక మంది వినతుల మేరకు రైల్వే అధికారులు విశాఖపట్నం నుంచి బొబ్బిలి మీదుగా సాలూరుకు పాసింజర్ రైలు బండి నడపాలని నిర్ణయించారు. దీనికి అవసరమైన ట్రాక్, విద్యుత్ సౌకర్యాలను కల్పించారు. దండిగాం సమీపంలో రైల్వే స్టేషన్ నిర్మించారు. ఎట్టకేలకు రైలు బండి రాకకోసం ట్రయిల్ రన్ పూర్తయింది. దసరా తర్వాత రైలు బండి పూర్తి స్థాయిలో నడిచే అవకాశం వుందని రైల్వే అధికారులు చెబుతున్నారు.

ట్రయిల్ రన్‌గా వచ్చిన ట్రైన్

గిరిజన సంక్షేమశాఖ డిడి రిలీవ్

సాంఘిక సంక్షేమశాఖ డిడికి అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాంగద కృష్ణను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఆయన్ను సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ కొద్దిరోజుల క్రితం ఉత్తర్వులు జారీచేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డిడి గయాజుద్దీన్‌కు గిరిజన సంక్షేమ డిడి అదనపు బాధ్యతలు అప్పగించారు. గిరిజన సంక్షేమ శాఖ చరిత్రలో ఇంతవరకు సాంఘిక సంక్షేమ అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించిన దాఖలాల్లేవు. గిరిజన సంక్షేమ శాఖలోనే సీనియర్ సహాయ గిరిజన సంక్షేమ అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాల్సి వుంది. అయితే సాంప్రదాయానికి విరుద్ధంగా సాంఘిక సంక్షేమ అధికారికి ఇంఛార్జి బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశమవుతోంది. గిరిజన సంక్షేమ డిడి రుక్మాంగద కృష్ణ పనితీరు బాగోలేదని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకే కలెక్టర్ ఈ ఉత్తర్వులు జారీచేశారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. బలమైన కారణమేదీ లేకుండా డిడిని సరెండర్ చేయడంపై గిరిజన సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

మాది ప్రజా ప్రభుత్వం : మంత్రి

పెదపదంలో ఆరోగ్య ఉపకేంద్రానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సాలూరు రూరల్

తమది నిరంతరం ప్రజా సంక్షేమం గురించి ఆలోచించే ప్రజా ప్రభుత్వమని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద పదములో రూ.55 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రతినిత్యం ప్రజల సంక్షేమం గురించి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ప్రజారోగ్యరక్షనే ధ్యేయంగా ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని రాష్ట్రంలో 40 ఆరోగ్య ఉపకేంద్ర భవనాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంజూరు చేశారని అందులో మన మన్యం జిల్లాకు 8 మంజూరయ్యాయని తెలిపారు. వాటిలో సాలూరు నియోజకవర్గానికి నాలుగు భవనాలు మంజూరయ్యాయని, వాటిని గంజాయిబద్ర,పట్టుచెన్నూరు, కుర్మారాజు పేట,పెద పదం పంచాయతీలలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎన్నోయేళ్లగా కలగా మిగిలిపోయిన ఎత్తి పోతల పథకం గురుంచి పెదపదం పంచాయతీ ప్రజలు మంత్రి అడగ్గా ఈ ప్రాంత ప్రజలు మెట్టప్రాంతంలో ఉండటం వలన వ్యవసాయ బోర్లు లేకపోవడంతో రైతులు వలసలు పోతున్నారని ,ఈ వలసలను అరికట్టాలంటే ఎత్తి పోతల పథకం ఆవశ్యకత చాలా వుందని, తప్పకుండా మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో గర్భిణులకు సీమంతాలు చేశారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్ లను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ఆర్ పి భంజీ దేవ్, టిడిపి సాలూరు,మక్కువ మండల పార్టీ అధ్యక్షులు పరమేష్, గుల్ల వేణు, మత్స్యశ్యామ్, సాయి, అనురాధ, సింహాచలం, తిరుపతి రావు, ఎంపిడిఒ జి.పార్వతి, వెలుగు ఎపిఎం సింహాచలం, ఇంజినీరింగ్ అధికారులు,వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు

మున్సిపల్ మేనేజర్‌గా శివప్రసాద్

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ మేనేజర్‌గా బిఎం శివప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మేనేజర్ రాఘువాచార్యులు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ సిహెచ్.సత్యానారాయణ, ఆర్వో ప్రసాదరావు, సిబ్బంది కొత్త మేనేజర్‌ను అభినందించారు.

లంకాజోడులో దారుణం

పిల్లలకు విషమిచ్చి తానూ తాగిన తల్లి

ప్రజాశక్తి - కురుపాం

మండలం లంకాజోడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం దారుణం చోటుచేసుకుంది. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు.. కుటుంబ కలహాలు కారణంగా బిడ్డిక రమ్య తన 6నెలల చిన్నారికి, 5ఏళ్ల కుమారునికి విషం పట్టి తాను కూడా తాగిన సంఘటన చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే స్పందించి వారిని భద్రగిరి ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. రమ్య భర్త రమేష్ పార్వతీపురంలో పోలీసు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

పోస్టల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పోస్టల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

టార్గెట్లకు వ్యతిరేకంగా శుక్రవారం స్థానిక హెడ్ పోస్టాఫీస్ ఎదుట ఎన్ఎఫ్‌పిఇ, ఎఐజిడిఎస్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన తెలిపారు. డిమాండ్లతో కూడిన పోస్టు కార్డులను ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు మరియు బ్రాంచ్/డివిజన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏచూరికి నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ఏచూరి మరణం రైతు, కార్మికవర్గానికి లోటు

ప్రజాశక్తి - పాచిపెంట

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి రైతు, కార్మిక వర్గానికి తీరని లోటని మండల సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మర్రి శ్రీనివాసరావు అన్నారు. సీతారాం ఏచూరి మరణానికి నివాళులర్పిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు సూకురు అప్పలస్వామి ఆధ్వర్యాన జరిగిన సంతాప సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు రైతాంగానికి, ప్రపంచ కార్మిక వర్గానికి తీరని లోటు అని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు సీతారాం ఏచూరి వ్యక్తిత్వాన్ని కొనియాడుతూ సంతాపం తెలిపారన్నారు. ఆయన ఆయన సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, ఎస్.రామారావు, సుబ్బారావు, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాబివృద్ధి అధికారి సాయికృష్ణతేజ

జాబ్‌మేళాలో 53మంది ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళా కు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి కృష్ణ చైతన్య హాజరయ్యారు. పాల్గొని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారని, 273 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగా అందులో 53 మంది ఎంపికయ్యారని తెలిపారు.

మంత్రి పూల బొకేను అందజేస్తున్న జనసేన నాయకులు పెంట తిరుపతినాయుడు

మంత్రిని కలిసిన జనసేన నాయకుడు

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర రాజధాని అమరావతిలో చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మండల జనసేన నేత పెంట తిరుపతిరావు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా స్థానిక రాజకీయాలపై చర్చించారు. అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో పార్వతీపురం జిల్లా జనసేన ఇన్చార్జి ఎ.మోహనరావు, గుల్లిపల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు

తహశీల్దారుగా జయలక్ష్మి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్థానిక తహశీల్దారుగా జయలక్ష్మి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్ఐ రామకృష్ణతో పాటు విఆర్ఒల సంఘం నాయకుడు పురుషోత్తం పుష్పగుచ్ఛంతో ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె సబ్ కలెక్టర్ శ్రీ వాస్తవ కార్యాలయానికి వెళ్లి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంకితభావంతో పనిచేసి రెవెన్యూ శాఖకు గుర్తింపు తేవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

డిగ్రీ కళాశాలలో ఉల్లాసంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శ్యాంబాబ్ అధ్యక్షతన సీనియర్ విద్యార్థులు 2024-2025 విద్యా సంవత్సరంలో జాయిన్ అయిన విద్యార్థులను ఆహ్వానిస్తూ శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. తొలుత కాలేజీ ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాల స్థితిగతులు, కళాశాలలో ఉన్నవనరులు గురించి వివరించారు. కళాశాల న్యాక్ బి ప్లస్ గ్రేడ్ పొందటంలో అధ్యాపకులు, విద్యార్థు కృషి అభినందనీయమని తెలిపారు. సీనియర్ విద్యార్థులు వలె ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అంతా ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పర్చుకొని వాటిని సాధించుకునే దిశగా కృషిచేసి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక స్థానిక డిఎస్‌పి ఎం రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రమాదకరమైన సామాజిక మాధ్యమాలకు, ఆన్లైన్ మోసాలకు, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు బానిస కాకుండా సామాజిక బాధ్యతతో మెలిగి క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. స్థానిక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ప్రముఖ ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ రౌతు భారతి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలంటే విద్యయే ప్రధాన ఆయుధమని అందుచేత ప్రతి విద్యార్థి చదువును అభ్యసించి క్రమశిక్షణతో వారి లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సిపిడిసి సెక్రటరీ కె.చౌదరినాయుడు, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు సుంకరి సుధాకర్, కోశాధికారి కంబాల రవిరాజ్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.జయమణి, ఐక్యూ.ఏ.సి కోఆర్డినేటర్ బి.రాజు, కళాశాల సీనియర్ అధ్యాపకులు ఎం .శాంతి, డా. సిహెచ్ రాఘవేందర్‌నాయుడు, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాలొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలో పెదపెంకిలో వృద్దులకు స్నేహచైతన్య సేవా సంస్థ అధినేత మరిశర్ల కష్ణ మూర్తి నాయుడు తన తండ్రి జ్ఞాపకార్థంగా ఆయన వృద్దులకు, వికలాంగులకు శుక్ర వారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు మాట్లాడుతూ అనేక సార్లు అనేక విధాలుగా కృష్ణమూర్తి నాయుడు ఎన్నో కార్యక్రమాలు పేదలకు చేస్తున్నారన్నారు. ఆయన నేతాజీ గ్రంథాలయానికి కూడా ఆర్థికంగా, ఇతర అన్నిలా సహాయ సహకారాలు అందజేస్తున్నారు అని తెలిపారు..

మృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న గ్రంథాలయ సంఘం నాయకులు

పలువురు ఎంపిడిఒలు బాధ్యతల స్వీకరణ

జిల్లాలో పలు మండలాల్లో మండల పరిషత్ అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చారు.

కురుపాం : స్థానిక ఎంపిడిఒగా జె. ఉమామహేశ్వరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిసిస్తున్న ఎస్.అప్పారావు ఎల్.కోట బదిలీపై వెళ్లగా, ఈమె పాలకొండ నుంచి కురుపాం వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పజాప్రతినిధులు, అధికారులు సహాయ, సహకారాలు తీసుకొని అందర్నీ కలుపుకొని పనిచేస్తూ మండలాన్ని అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. విధుల్లో చేరిన ఎంపిడిఒకు సిబ్బంది పలువురు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

మక్కువ: స్థానిక ఎంపిడిఒగా డి.స్వరూప రాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వేపాడ మండలం నుండి ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. మండలంలో పరిస్థితులపై స్థానిక పంచాయతీ కార్యదర్శులు ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించి చర్చించారు.

వీరఘట్టం: స్థానిక ఎంపిడిఒ బి.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఎంపిడిఒ ఎఫ్‌ఎసిగా విధులు నిర్వహించిన వై.వెంకటరమణ శ్రీకాకుళం మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ బి.వెంకటరమణ మాట్లాడుతూ అంతా సహాయ సహకారాలతో మండలాన్ని అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తానని భరోసఇచ్చారు. అనంతరం వెంకటరమణను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎఒ జి.వెంకటరమణ, సీనియర్ సహాయకులు వి.శ్రీనివాస్, జూనియర్ సహాయకులు అంపిలి శ్రీకాంత్, రాజు, సావిత్రి, గోవింద, తదితరలు, పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక ఎంపిడిఒగా పి.త్రివిక్రమరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సమస్యలను తెలుసుకుని ప్రజా ప్రతినిధులు, ఉద్యోగుల సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే జూనియర్ అసిస్టెంట్ చుక్క రామునాయుడు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన జి.శేఖర్ పెదపెంకి జిల్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. అలాగే సీనియర్ అసిస్టెంట్ కె.చిన్నారావు బదిలీపై భోగాపురం బదిలీ అయ్యారు.

సీతానగరం ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరిస్తున్న త్రివిక్రమరావు

పార్వతీపురం రూరల్ : పార్వతీపురం ఎంపిడిఒగా కె.రూపేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన అకిబ్ జావేద్ ప్రకాశం జిల్లాకు బదిలీ కాగా. ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన రూపేష్ ఎల్ కోట ఎంపిడిఒగా పనిచేసి పార్వతీపురం బదిలీపై వచ్చారు. మండలంపై అవగాహన పెంచుకొని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈయనకు ఎఒ జివి రమణ, ఇఒపిఆర్‌డి రామకృష్ణ, ఆఫీసు సిబ్బంది అర్జున, ఫాల్గుణ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ప్రతి పల్లెకూ బిటి రోడ్డు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి పల్లెకు బిటి రహదారుల నిర్మాణ పనులు చేపడతామని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని చిట్టిపూడివలస, యు.వెంకంపేటకు ఉపాధిహామీ చట్టంతో రూ.కోటీ70 లక్షలతో బిటి, సిసి రహదారులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ఏ గ్రామానికి కూడా రహదారి నిర్మాణ పనులు చేపట్ట లేదని, ఈ కారణంగా పల్లె ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పల్లె ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. పల్లె ప్రజలు ప్రశాంతంగా ప్రయాణించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టిడిపి హయాంలో నిర్మించిన రహదారులను గత వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎక్కడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఏ గ్రామంలోనైనా రహదారుల అధ్వానంగా ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే రహదారుల్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కుమిలి పాపమ్మ, ఎంపిటిసి జి.విశాలాక్షి, పార్టీ సీనియర్ నాయకులు పి.కృష్ణమూర్తినాయుడు, పండురంగా మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ్, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వివాదం పై సుప్రీం తీర్పు ను స్వాగతిస్తున్నా

ప్రజాశక్తి - సాలూరు

తిరుపతి లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందని సిఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు చేయడం, దానిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఘాటుగా స్పందించిన తీరుతో ప్రజలకు వాస్తవాలు తెలుస్తున్నాయని చెప్పారు. ఇంకా నిజాలు నిగ్గు తేల్చాలనే సుప్రీంకోర్టు సిబిఐ, రాష్ట్ర పోలీసు అధికారులతో కలిపి విచారణ జరిపించాలని ఆదేశించడం హర్షణీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పోలీసులతో విచారణ జరిపితే నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేదనే సుప్రీంకోర్టు సిబిఐ అధికారులతో కలిసి విచారణ జరిపించాలని ఆదేశించిందని రాజన్నదొర చెప్పారు.

రేషన్ వ్యాన్‌లో బియ్యం పంపిణీ చేస్తున్న నిర్వాహ కుడు

పండగ పూటా కందిపప్పుకు కరువు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

దసరా, దీపావళి పండగలు సమీపిస్తున్న వేళ రేషన్ దారులకు ఎప్పటిలాగానే, కందిపప్పు, పంచదార లేకుండానే రేషన్ సరుకులు పంపిణీ చేయడం పట్ల వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.150 కందిపప్పును 67 రూపాయలకే, 40 రూపాయల పంచదారను 15 రూపాయలకే పంపిణీ చేస్తామని ఇప్పటికే గొప్పగా ప్రకటించిన పౌర సరఫరాల శాఖ మంత్రి మాటలు ఆచరణకు నోచుకోవడం లేదు. మండలంతో పాటుగా జిల్లాలోని 15 మండలాల్లోనూ 2, 81 251 రేషన్ కార్డులో ఉండగా, వారికి 281 మెట్రిక్ టన్నుల కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ ఈ నెల కేవలం 30 మెట్రిక్ టన్నులు రావడంతో ముందుగా వచ్చిన వారికి ముందుగా పంపిణీ చేస్తున్నామని వాహన నిర్వాహకులు చెబుతున్నారు. ఇలా చెప్పడం ఇదే మొదటిసారి కాదని గత మూడు నెలలుగా ఇదే మాట చెబుతూ కేవలం బియ్యం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని రేషన్ దారులు వాపోతున్నారు. ఒకసారి రేషన్ తీసుకున్న తర్వాత మళ్లీ పంపిణీ చేస్తారన్న నమ్మకం లేకపోవడంతో రాబోతున్న పండగలకు కనీసం పప్పన్నం కూడా కరువైందని లోలోన మదన పడుతున్నారు.

రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పల్లెల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ప్రతి పల్లెను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే బి.విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని పెద్దఅంకలాంలో రూ.67 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం రైతు సేవా కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గ్రామస్తులుకు ఇచ్చిన మాట ప్రకారం గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఎంతగానో ఆదరించిన గ్రామస్తులకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ రెండు భవనాలు సిద్ధం చేసి ప్రారంభానికి ఉన్నప్పటికీ గత ప్రభుత్వం చేయలేదని, వీటిని చేసి ప్రజలకు అంకితం చేస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచే నిధులతో అభివద్ధి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు తీసుకొచ్చి యువకులకు, మహిళలకు, వృద్ధులకు, రైతులకు చేతివృత్తిదారులకు, అన్ని వర్గాల వారి అభివృద్ధికి తన కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బలగా శ్రీనివాసరావు, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యం నాయుడు, రౌతు వేణుగోపాల నాయుడు, కృష్ణరాయపురం సర్పంచ్ గునుపూరు అన్నంనాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిటిసిల వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

ఎంపిటిసి సభ్యుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని గిరిజన సంఘం నాయకులు చెముడుగూడ ఎంపిటిసి ఎం.రమణ ప్రభుత్వానికి అధికారులకు కోరారు. ఈ సందర్భంగా ఆయన కురుపాంలో విలేకరులతో మాట్లాడారు. నేటికి 8నెలలు అవుతున్నా ఎంపిటిసిలకు గౌరవ వేతనం విడుదల చేయలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదు నెలల వేతనాలు బకాయిలు ఉండగా కూటమి ప్రభుత్వం వచ్చి మూడు నెలలవుతున్నా నేటికీ ఎంపిటిసిలకు గౌరవ వేతనాలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ప్రజా ప్రతినిధులకు రావాల్సిన వేతనాలే సకాలంలో అందకపోతే సామాన్య ప్రజలకు ఏ విధంగా సంక్షేమ పథకాలు అందుతాయో అర్థం కావడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి తక్షణమే వేతనాలను వెంటనే విడుదల చేయాలని లేదంటే ఎంపిటిసిలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నడక ఆరోగ్యానికి మంచిది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

నిత్య జీవితంలో నడక ఆరోగ్యానికి ఎంతో మంచిదని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆరోగ్యం, సామాజిక కార్యక్రమాలకు కృషి చేస్తున్న వాకర్స్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నోబుల్ వాకర్స్ క్లబ్ సభ్యులతో కలిసి ఆయన మార్నింగ్ వాక్ చేశారు. అనంతరం సభ్యులతో కొంత సేపు సంభాషించారు. నిరంతరంగా సభ్యులు ఆరోగ్య సాధనకు దృష్టి సారించడం ఆదర్శనీయమని, వారు నడుస్తూ మరి కొంతమందిని నడిపించడం అందరికీ ఆరోగ్యం పంచడమే అని అన్నారు. అనంతరం వాకర్స్‌తో కలిసి కొంత సమయం ఆరోగ్య సాధన, వ్యాయామాలు చేశారు. భవిష్యతులో మరింతమంది నడకకు రావడంతో పాటు సామాజిక కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించేలా కృషి చేయాలని సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో పట్టణంలోని పలు వ్యాపారవేత్తలు, క్లబ్ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణకు సన్నాహాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని ఎంఆర్ నగరంలో స్వచ్ఛతేహి సేవ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా చెత్త సేకరణకు సన్నహాలు చేస్తున్నామని సర్పంచి వంగపండు లక్ష్మీ త్రినాథ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ గ్రామంలోని 800 ఇళ్లకుగానూ ఒక్కొక్క ఇంటికి తడి పొడి చెత్త సేకరణ నిమిత్తం 1600 ప్లాస్టిక్ డస్ట్‌బిన్‌లను సిద్ధం చేశామన్నారు. సేకరించిన వ్యర్థాలను ఎరువులుగా మార్చి రైతులకు సరసమైన ధరలకే తిరిగి అందించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

కంబరలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం పరిధిలోని కంబరలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి పి ఉమామహేశ్వర ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, మధుమేహ, రక్త పోటు, తదితర వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం హేమ, ఎంఎల్‌హెచ్‌పి రామకృష్ణ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, పాల్గొన్నారు.

6 నుంచి ఎపిటిఎఫ్ మహాసభలు

ప్రజాశక్తి - సీతానగరం

ఎపిటిఎఫ్ 20వ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలు ఈనెల 6,7,8 తేదీల్లో విజయనగరంలో జరుగుతాయని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మార్పు బాలకష్ణమ్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.వెంకటనాయుడు, మండల ఎపిటిఎఫ్ నాయకులు బి.రవికుమార్, వై సత్యం నాయుడు కోరారు. శుక్రవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపిటిఎఫ్ ఏర్పడి 80 వసంతాలు వేడుకలు సందర్భంగా విజయనగరం జగన్నాథ కళ్యాణమండపంలో జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలకు రాష్ట్ర నాయకులు, మంత్రులు హాజరవుతున్నారన్నారు.

గ్రంథాలయ వివరాలను అడిగి తెలుసుకుంటున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక శాఖా గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు తీసుకొంటామని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సీతంపేటలోని శాఖ గ్రంథాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం చిన్నదిగా ఉండడం వల్ల ప్రస్తుత గ్రంథాలయాన్ని మండల మహిళా సమాఖ్య భవనంలోకి మార్చేందుకు గల అవకాశాలను పరిశీలించాలన్నారు. అదే విధంగా అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొంటామని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, గ్రంథాలయాధికారి గణేష్, అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులుగా మమ్ముల విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - సీతానగరం

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులుగా మమ్ముల విశ్వేశ్వర రావును జిల్లాలోని ఆర్యవైశ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఈనెల 6న పార్వతీపురంలో బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. సీతానగరానికి చెందిన మమ్ముల విశ్వేశ్వరరావుకు ఈ పదవి లభించడం పట్ల సీతానగరంలోని ఆర్యవైశ్యులతో పాటు మండల ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈనెల 6న పార్వతీపురం వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని ఆర్యవైశ్యులంతా పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-విజయనగరం

కందిపప్పు కరువే అనే శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి జిల్లా పౌర సరఫరాల అధికారులు స్పందించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అక్టోబర్ నెలకు జిల్లాకు మొత్తం 260 మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించారని తెలిపారు. కందిపప్పు సరఫరా దారులకు మూమెంట్ ఆర్డర్ ఇచ్చారని పేర్కొన్నారు. సరాఫరా చేసిన కందిపప్పు జిల్లాలోని 11 ఎంఎల్ఎస్ పాయింట్‌లకు సమనంగా సరఫరా చేసి కార్డుదారులకు పంపిణీ చేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాకు కేటాయించిన కందిపప్పులో ఇంకా సరఫరా చేయాల్సిన కందిపప్పులో 61 మెట్రిక్ టన్నులు రవాణాలో ఉండగా, మిగిలిన 129 మెట్రిక్ టన్నుల కందిపప్పు కూడా ఈనెల 10లోగా కార్డుదారులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఘనంగా కోటదుర్గమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల రావాడ జంక్షన్ వద్ద వెలసిన కోట దుర్గమ్మ తల్లి దసరా నవరాత్రాలు సందర్భంగా శుక్రవారం బాల త్రిపుర సుందరి దేవి అలంకరణ అవతారంలో పూజలు అందుకున్నారు. కురుపాం గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వేద పండితుల మధ్య కుంకుమ పూజలు చేస్తూ దేవి నామస్మరనతో కోట దుర్గ ఆలయ ప్రాంగణంలో మారుమోగుతుంది.

డిపిఒగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పంచాయతీ అధికారిగా టి.వెంకటేశ్వ్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన శ్రీకాకుళం జిల్లాలో డిపిఒగా పనిచేస్తూ, ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన ఇంతకుముందు ఇక్కడ జిల్లా పరిషత్ సిఇఒగా పనిచేసిన అనుభవం ఉంది. జిల్లాలో డిపిఒగా పనిచేస్తున్న శ్రీధర్‌రాజా శ్రీకాకుళం పంచాయతీ అధికారిగా బదిలీపై వెళ్లారు.

పారాది వంతెనకు మోక్షం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పారాది వంతెన పనులను శుక్రవారం ఎమ్మెల్యే బేబినాయన పునప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన, డైవర్షన్ రోడ్డుకు కలిపి ఇప్పుడు రూ.13.40 కోట్లతో నిర్మాణం పనులను ప్రారంభించామన్నారు. రెండు రాష్ట్రాలకు ప్రధాన మార్గంలో ఉన్న వంతెన సమస్య తీవ్రతను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి వివరించినట్లు తెలిపారు. దీనికి ముఖ్యమంత్రి స్పందించారని తెలిపారు. తన తాత ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన బ్రిడ్జి స్థానంలో కొత్త వంతెన పనులు ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. వచ్చే ఏడాది వర్షాకాలంలోగా వంతెన నిర్మాణం పూర్తిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, రొంపిల్లి సర్పంచ్ బవిరెడ్డి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల పరిధిలో తోటపల్లి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడు మృతి చెందనట్లు ఎస్ఐ రమేష్ నాయుడు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం టి.దత్తివలసకు చెందిన మవుదురు బాల భాస్కర శర్మ (58) ఖడ్గవలస జంక్షన్ నుంచి చినమేరంగి వైపు మోటార్‌సైకిల్‌పై వస్తుండగా, ఎదురుగా వున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ భాస్కరశర్మను 108లో ఆసుత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మరణించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ తెలిపారు.

హత్యకేసులో ఏడేళ్ల జైలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

హత్యాయత్నం కేసులో ముద్దాయికి శుక్రవారం ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ స్థానికసీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణ తీర్పు వెలువరించారని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొర్లి వెంకటరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం పెదమేరంగిలోని 2019లో పల్లా ధర్మారావుపై లోకనాథం అలియాస్ నాని హత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో శిక్షణ విధించినట్లు ఆయన వెల్లడించారు.